# 11

# ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి

"ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథ" అనే సినిమాను చలన చిత్రాల కంపెనీ 1965లో క్రీస్తు జీవితం మీద రిలీజ్ చేసింది. ఆయన జన్మతో ఆరంభించి, ఆయన భూసంబంధమైన పరిచర్య, నిరాకరించబడడం, సిలువ మరణం, సమాధి, పునరుత్థానాలు ఆ సినిమాలో చిత్రించబడ్డాయి. ప్రభువైన యేసును గూర్చి చిత్రించడంలో ఆ సినిమాను తీసినవారు బైబిలునకు నమ్మకంగా ఉండకపోయినా, దానికి పెట్టిన పేరు మాత్రం నిజమైన క్రీస్తు జీవితం ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథ అనే విషయాన్ని జ్ఞాపకం చేస్తుంది.

ప్రభువైన యేసు యొక్క జననం, జీవితం, మరణం, పునరుత్థానం అనేవి ఎన్నడూ చెప్పబడనంత గొప్ప కథయైయున్నట్టయితే, ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథ తదుపరి ఏమి జరిగింది? క్రొత్త నిబంధనలోని అపొస్తలుల కార్యాలను చదివినట్లయితే, దానికి జవాబు స్పష్టమౌతుంది: చెప్పబడిన మహా గొప్ప కథలలో రెండవది ప్రభువు యొక్క సంఘు స్థాపన.

దేవుని రాజ్యాన్ని, సంఘాన్ని తీసికొని రావడం అనే కథ, ఒకడు ఎదురు చూచునట్లే, అద్భుతమైన కృత్యాలతోనూ, ఊపిరి బిగపట్టే ఉత్సాహంతోనూ నిండి ఉంది. అపొస్తలుల కార్యాల్లో అధ్యాయం 1– అధ్యాయం 2 – నాటక ప్రదర్శనాన్ని తెలుపుతుంది.

ఈ ఒక్క అధ్యాయమే పుస్తకం అంతా అనుకొని లేదా కథ మొత్తం అనుకొని అపొస్తలుల కార్యాల్లోని ఈ అధ్యాయాన్ని తిరిగి చదువుదాం. ఈ కథను బలవంతపెట్టే, ప్రేరేపించే భాగాలుగా విభజించునట్లు యిది వీలు కలిగిస్తుంది. "ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి" అనే దాని తరువాత వచ్చే ప్రతి అధ్యాయం కూడా

సంఘ స్థాపన అనే కథలోని ఉత్సాహకరమైన ఒక భాగాన్ని తెలియజేస్తూ ఉంటుంది.

## అధ్యాయం ఒకటి:

## "దైవికమైన కుమ్మరింపు"

మనం ఈ పుస్తకాన్ని ప్రారంభిస్తుండగా, "దైవికమైన కుమ్మరింపు" అని పిలువబడిన తొలి అధ్యాయాన్ని మనం తెరుస్తాం.

అపొస్తలుల కార్యములకు లేఖకుడైన లూకా యిలా అన్నాడు, "పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి" (అపొ. 2:1). అందువలన, కథకు సెట్టింగు, పెంతెకొస్తు దినమున చారిత్రక పురమైన యెరూషలేము ఉంది. "అంత్యదినములు" అనే శకపు ఆరంభమందు యెరూషలేమునుండి యెహోవా వాక్కు బయలు వెళ్లునని ప్రవచన రూపంగా యెషయాయు (యెషయా 2:2–4), మీకాయు (మీకా 4:1–3) గుర్తించారు. పాత నిబంధనలో పెంతెకొస్తు అనేది పొలములో విత్తిన వ్యవసాయముల తొలి పంటయొక్క కోత పండుగైయుంది (నిర్గమ. 23:16). రోమా సామ్రాజ్యమంతటిలోనుండి, ప్రాముఖ్యమైన ఈ పాత నిబంధన పండుగ నాచరించడానికిగాను యూదులలోనుండి పురుషులు తమ కుటుంబాలతో యెరూషలేము వచ్చి చేరుకున్నారు.

పెంతెకొస్తు అను పండుగ దినము పూర్తిగా వచ్చియుండగా, అసాధారణమైనది ఏదో సంభవించింది:

> అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని అకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడసాగిరి (అపొ. 2:2–4).

పరిశుద్ధాత్మ కుమ్మరింపు పొందింది అపొస్తలులు మాత్రమే. అపొ. 2ను, అపొ. 2కు నడిపించిన సందర్భమును ఈ విషయాన్ని స్పష్టంగా వివరిస్తుంది. మొదట, "వారు" అని అపొ. 2:1లో ప్రస్తావించింది, అపొ. 1:26లో చెప్పబడిన "పన్నిద్దరు అపొస్తలులే." ఈ కథ వివరణకు వచ్చేసరికి శ్రద్ధను ఆకర్షించే కేంద్రంగా ఉన్నవారు అపొస్తలులే. రెండవది, పరిశుద్ధాత్మ రాకను గూర్చిన ఈ వర్ణన (అపొ. 2:1–21),

అపొస్తలులు తప్ప మరి ఎవ్వరును పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందినట్టు సూచింపనూ లేదు. అపొస్తలులు ఆత్మద్వారా ఆయా భాషలు మాటలాడుతున్నట్టు చూచినవారు, అపొస్తలులు మాత్రమే అలా మాట్లాడుతున్నట్టు గుర్తించారు (అపో. 2:7).

పరిశుద్ధాత్మ కుమ్మరింపబడడానికి మూడు సంవత్సరాల ముందునుండి, ఆయా సందర్భాలలో, క్రీస్తు ప్రభువు తన అపొస్తలులకు ఒక రోజున పరిశుద్ధాత్మతో ఎలా బాప్తిస్మము యివ్వబోతాడో అనే సంగతి వాగ్దానం చేయబడింది. క్రీస్తు పరిచర్య ఆరంభ కాలమందు, బాప్తిస్మమిచ్చు యోహాను యిలా అన్నాడు, "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్లలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నా కంటె శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" (మత్తయి 3:11). ఆయన ఆరోహణానికి కొంచెం ముందుగా క్రీస్తు వారితో చెప్పినదేమంటే, "యోహాను నీళ్లతో బాప్తిస్మము ఇచ్చెను గాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను" (అపో. 1:5). ఆరోహణ సమయంలో, వారి యొద్దనుండి వెళ్లిపోక ముందు ప్రభువు తన అపొస్తలులతో మాట్లాడుతూ, వారు యెరూషలేమునుండి వెళ్లవద్దనియు, తనవలన వినిన తండ్రియొక్క వాగ్దానం కొరకు వారు అక్కడే కనిపెట్టుకొని యుండాలనియు ఆయన వారికి తెలియజేశాడు. వారు అక్కడ పైనుండి శక్తి పొందాలట (లూకా 24:46-49; అపో. 1:4). పెంతెకొస్తు దినమున, దైవికమైన కుమ్మరింపుగా వచ్చిన పరిశుద్ధాత్మ, అపొస్తలుల మీదికి పరిశుద్ధాత్మ వచ్చుననే ప్రభువు వాగ్దానాలన్నిటిని నెరవేర్చుతుంది.

పరిశుద్ధాత్మ పరలోకంనుండి పోయబడినప్పుడు ఏదో యొకటి వినిపించింది: "...అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి..." (అపో. 2:2) కలిగింది. మరియు ఏదో ఒకటి కన్పించింది కూడ: "మరియు అగ్నిజ్వాలలవంటి నాలుకలుగా విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ" (అపో. 2:3). ఏదో కొంత అనుభూతికూడా కలిగింది: అపొస్తలుల మీదికి పరిశుద్ధాత్మ రావడాన్ని జనులు చూచిన విధానం, ఆ ఆత్మ వారికి వాక్ శక్తిని అనుగ్రహించిన కొలది వారు అన్యభాషలతో మాట్లాడసాగడమే. బలమైన గాలివంటి శబ్దం విని ఏమి జరుగుతుందో చూద్దామని వచ్చిన జనులకు మానవ భాషల్లో అపొస్తలులు మాటలాడారన్న విషయంలో ఏ సందేహము లేదు. అపొస్తలులయొద్దనుండి వారు ఏమి వింటున్నారో దానిని గూర్చి జనులు మాట్లాడినప్పుడు, వారు *dialektos* ("దేశపు భాష" అని తర్జుమా చేయబడింది అపో. 2:6, 8), మరియు *glossais* ("మన

భాషలతో"; అపొ. 2:11) అనే పదాలను ఉపయోగించారు.

మూడు దైవికమైన ఉద్దేశాలకొరకు అపొస్తలులు పరిశుద్ధాత్మతో బాప్తిస్మం పొందారు. మొదటిది, దైవ ప్రేరేపణకొరకు వారు బాప్తిస్మం పొందిరి. లోకానికి దేవుని ప్రత్యక్షత అనుగ్రహించునట్టు పరిశుద్ధాత్మ వారిని ప్రేరేపిస్తాడు. క్రీస్తు ప్రభువు అపొస్తలులకు యిలా వాగ్దానం చేశాడు, "ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). ఇప్పుడు, పరిశుద్ధాత్మ రాకతో, దైవప్రేరేపణను గూర్చి ప్రభువు తన అపొస్తలులకు చేసిన వాగ్దానం నెరవేర్చబడుతుంది.

రెండవది, వారు ప్రకటించే సందేశము దేవునినుండి కలిగిందేయని స్థిరపరచ డానికి వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందారు. సూచక క్రియలు, మహత్కార్యములు, అద్భుతములచేత వారు ప్రకటించే సందేశాన్ని రుజువు చేయడానికి లేదా స్థిరపరచ డానికి శక్తిగలవారగునట్టు వారు పరిశుద్ధాత్మచే బలపరచబడతారు. క్రీస్తు వారికి యిలా వాగ్దానం చేశాడు, "నమ్మినవారివలన ఈ సూచకక్రియలు కనబడును; ఏవనగా, నా నామమున దయ్యములను వెళ్లగొట్టుదురు; క్రొత్త భాషలు మాటలాడుదురు, పాములను ఎత్తి పట్టుకొందురు, మరణకరమైనదేది త్రాగినను వారికి హాని చేయదు, రోగులమీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురని వారితో చెప్పెను" (మార్కు 16:17, 18). ఆత్మ ద్వారా అపొస్తలులు అద్భుతములు చేయుచుండగా వారు దేవుని యొద్దనుండి పంపబడిన మనుష్యులని స్థిరపరచడానికి గాను ఆ వాగ్దానము నెరవేర్చబడుతుంది. దాని నెరవేర్పుకు ఉదాహరణ అపొ. 14:3లో కన్పిస్తుంది: "కాబట్టి వారు ప్రభువును ఆనుకొని ధైర్యముగా మాటలాడుచు అక్కడ బహుకాలము గడిపిరి. ప్రభువు వారిచేత సూచక క్రియలను అద్భుతములను చేయించి, తన కృపావాక్యమునకు సాక్ష్యమిప్పించు చుండెను."

మూడవది, తాము యితర క్రైస్తవుల మీద చేతులుంచి అద్భుత వరములు అనుగ్రహించు శక్తిగలవారగునట్లు వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మంపొందారు. ఇలా యివ్వగల శక్తియొక్క ఉదాహరణ అపొ. 8:14-24లో యివ్వబడింది: ఫిలిప్పు క్రీస్తును ప్రకటించుట ద్వారా మార్పు చెందిన క్రొత్త వారిపై చేతులుంచడానికిని, అద్భుత వరములు వారికి ప్రసాదించడానికిని పేతురు యోహాను అను యిద్దరు అపొస్తలులు యెరూషలేమునుండి సమరయకు పంపబడ్డారు.

"ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి" యొక్క ఆరంభము నీకు, నాకు ఎలాటి భావాన్ని స్ఫురింపజేస్తుంది? క్రొత్త నిబంధనలో కన్పించే ప్రత్యక్షత

(దైవవాణి) దైవ ప్రేరేపితులైన మనుష్యులచే మనకు అనుగ్రహింపబడిందని మనకు అర్థమిస్తుంది. క్రొత్త నిబంధన సందేశము హెచ్చుతగ్గులు లేనిదని, ఎట్టి లోపమూ లేనిదని మనం నమ్మవచ్చు. పరిశుద్ధాత్మ బాప్తిస్మంవలన దేవుడు అపొస్తలులను బలపరచాడు; అపొస్తలులు తమ వంతులో, తమ చేతులు వారి మీద ఉంచుటద్వారా పరిశుద్ధాత్మ యొక్క అద్భుత వరములు యితర క్రైస్తవులకు ప్రసాదించారు (లేక) యిచ్చారు. ఆ విధంగా క్రొత్త నిబంధన లేఖకులందరు దైవ ప్రేరేపితులే, ఆత్మచే నడిపింపబడిన మనుష్యులే. క్రొత్త నిబంధన, దేవుడు మనుష్యులకు అనుగ్రహించిన దైవ వర్తమానమని బహు ధైర్యముగా నమ్మవచ్చు.

## అధ్యాయం రెండు:

## "శక్తివంతమైన ప్రసంగం"

"ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి" అనే దానికి రెండవ అధ్యాయము "శక్తివంతమైన ప్రసంగం" అని పేరుపెట్టబడింది. సంఘము స్థాపింపబడిన దినము సువార్త ప్రకటించిన దినమైయుంది. మొదట్లో, అపొస్తలులందరు అక్కడ చేరివచ్చినవారి దేశపు భాషలలో "దేవుని గొప్ప కార్యాలు పలికారు" (అపొ. 2:11). అప్పుడు పేతురు ఆ పదునొకండుగురితో లేచి నిలిచి, ఆనాటి సార్వత్రిక భాషయైయున్న ఒకవేళ గ్రీకులో మాట్లాడాడేమోగాని, యేసు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమింపబడిన సంగతిని వివరించుతూ సవిస్తర ప్రసంగాన్ని అతడు చేశాడు (అపొ. 2:14).

బలమైన గాలివంటి శబ్దముచేత సమకూర్చబడిన జనులందరు యూదులే, అసాధారణమైన అంతరంగపు శక్తిగలవారు ఆ తొలి సువార్త ప్రసంగానికి శ్రోతలుగా నిలిచియున్నారు. వారికి అంతరంగమందు దాగిన వివేచనా శక్తి ఉంది. వారు దేవునియందలి విశ్వాసులు, పాత నిబంధన లేఖనాలను బాగుగా ఎరిగినవారు. సువార్త సందేశాన్ని అంగీకరించడానికి మానసికమైన సిద్ధపాటు వారికుంది. వారు క్రీస్తు ప్రభువును అనేక దేశాలకు కొనిపోగల అవకాశం వారికుంది. రోమా సామ్రాజ్యం యొక్క అన్ని భాగాలనుండి వారు వచ్చారు. సువార్త సందేశాన్ని అంగీకరించి, అటు పిమ్మట తమ స్వదేశాలకు దానితో వెళ్లేజనులవలన క్రైస్తవ్యం యొక్క వ్యాపకం వెంటనే జరిగే అవకాశం ఉంది.

పేతురు ప్రకటించిన ప్రసంగం యొక్క సంగ్రహ సందేశం, దైవ ప్రేరేపితుడైన లూకా మనకు యిస్తున్నాడు (అపొ. 2:14-36). పేతురు ప్రసంగాన్ని గూర్చి అతడు

మనకు ప్రసాదించిన ప్రధానమైన దృక్పథం రెండు మూడు విధాలుగా అవుట్‌లైన్ చేయవచ్చు; కాని పరిచయము, విషయము, ముగింపు అనే ప్రసంగం యొక్క సహజమైన రూపంలో మనం దీన్ని అవుట్‌లైన్ చేద్దాం.

తన శ్రోతలు ఎక్కడ నిలిచియున్నారో, పేతురు అక్కడనుండి తన ప్రసంగాన్ని ప్రారంభించాడు. కొందరు అపహాస్యం చేస్తూ, “వీరు క్రొత్త మద్యముతో నిండి యున్నారు” అని అన్నారు. (అపొ. 2:13). సువార్త ఉపదేశకులకు ఏది ఉన్నా మంచి పేరు మాత్రం లేకుండా పోవచ్చు. నమ్మదగిన శీలము, ఆధారపడగలిగిన మంచి పేరు లేని ఏ సువార్త ఉపదేశకుడైనా, తాను నోరు తెరువక ముందే తప్పిపోడానికి విధింపబడ్డాడు, తాను సువార్తను ఎంత శక్తివంతంగా ఉపదేశించేవాడైనా, అతని నెవరు నమ్మరు (లేక) గౌరవించరు.

అపొస్తలులకు విరోధంగా మోపబడిన నేరానికి ప్రత్యుత్తరంగా పేతురు తన సువార్త ప్రసంగాన్ని ప్రారంభించాడంటే, అందులో, ఆశ్చర్యపడనవసరం లేదు. వారు వాస్తవాలను అపార్థం చేసికొన్నారంటూ అతడు రెండు సత్యాలను తెలిపాడు: మొదటిగా, అది ఏది కాదో దాన్ని గూర్చి తెలియజేశాడు. వారి సామాన్య జ్ఞానానికి అతడు విన్నవించు కున్నాడు. “మీరు ఊహించునట్టు వీరు మత్తులు కారు, ప్రొద్దుబొడిచి జామయిన కాలేద”ని అతడు అన్నాడు (అపొ. 2:15). “మద్యముతో మత్తులైయున్నారనేది వివరణ కానేరదు, ఎందుకంటే పెంతెకొస్తువంటి ప్రముఖమైన దినాన, ఉదయం యింత పెందలకడనే సాధారణమైన ఏ యూదుడును త్రాగి మత్తుడైయుండడు. మేము త్రాగినవారము కాదని మీ కామన్‌సెన్స్ చెప్పుతుంది” అన్నట్టు పేతురు మాట్లాడాడు. రెండవది, అది ఏదో పేతురు వివరించాడు. తాను మాట్లాడుతూ లేఖనాలకు వర్తింపజేసి యిలా అన్నాడు, “యోవేలు ప్రవక్తద్వారా చెప్పబడిన సంగతి యిదే” (అపొ. 2:16). అక్కడనుండి అతడు యోవేలు 2:28-32ను కోట్ చేయనారంభించాడు (అపొ. 2:17-21). ఈ విధంగా పెంతెకొస్తు దినాన ఆత్మ కుమ్మరింపబడడమనేది, “అంత్యదినములు” అనే యుగారంభానికి, సాక్షికంగా యోవేలు యొక్క ప్రవచనం నెరవేర్చబడిందనడానికి సందేహంలేదు. దానిపై పేతురు మాట మనకుంది. “యోవేలు ప్రవక్తద్వారా చెప్పబడిన సంగతి యిదే”నని పలికిన అతని మాటలు ఈ ప్రశ్నకు సంపూర్ణమైన చివరి జవాబుగా గౌరవించబడవలసియుంది.

ఈ ఆత్మ యొక్క కుమ్మరింపు “అంత్యదినములు” అనే యుగాన్ని ఆరంభించింది. అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మంచేత బలపరచబడియుండగా, అద్భుతములు చేయు సంఘ యుగము ఆరంభమయ్యింది. తరువాత అపొస్తలుల కార్యాలలో, యితర క్రైస్తవుల

మీద అపొస్తలులు చేతులుంచారు, మరియు కుమారులు కుమార్తెలు ప్రవచించారు, యౌవనులు దర్శనాలను చూచారు, వృద్ధులు కలలుకన్నారు, మరియు దాసులును దాసురాండ్రును ప్రవచించారు (అపొ. 6:6; 8:4–8, 14–24; 21:8, 9). అపొస్తలుల మీద కుమ్మరింపబడిన ఆత్మ ఊటయైయుండి, క్రైస్తవ్యం యొక్క ఆరంభ దినాల్లో అద్భుతములతో కూడిన ఏరును ప్రవహింపజేసింది. వ్రాయబడిన క్రొత్త నిబంధన ప్రత్యక్షమయ్యేవరకు అపొస్తలులు చేతులు ఉంచడంవలన బాల్య దశలో ఉన్న సంఘము యొక్క నడిపింపుకొరకు దేవుడు ఆత్మసంబంధమైన కృపావరాలను ప్రసాదిస్తూ ఉన్నాడు. వ్రాత రూపంలో క్రొత్త నిబంధన పూర్తియగుటతోను, అపొస్తలుల మరణంతోను, అపొస్తలులు ఎవరిపై చేతులుంచారో వారి మరణంతోను అద్భుతములతో కూడిన సంఘ ఆరంభం అంతమయ్యింది. వ్రాయబడిన వాక్యంద్వారా ఆత్మ సంఘాన్ని నడిపించే యుగం ఆరంభమయ్యింది.

అలాగున, ఆ సంభవం ఏమి కాదో, మరియు ఆ సంభవం ఏమైయుందో పేతురు యొక్క పరిచయం ఆ జన సమూహానికి సూచించింది. అతడు వారి కామన్‌సెన్స్‌కు విన్నవించుకున్నాడు, మరియు అతడు లేఖనానికి వర్తింపజేశాడు. తన శ్రోతలు నిలిచియున్న చోటునుండి, యేసే వారి మెస్సీయాయైయున్నాడనే రుజువులను ఆలోచించ డానికి సిద్ధపడేవరకు వారిని కొనిపోయాడు.

యేసే క్రీస్తైయున్నాడని నమ్మడానికి గాను వివిధములైన దారుల్లో రుజువులను తెలుపుటతో పేతురుయొక్క ప్రసంగపు విషయం కూడియుంది. వేలమంది జనులు కూడియున్న సభయెదుట నీవు నిలిచి, యేసే క్రీస్తైయున్నాడని నమ్మడానికి ఆధారాలను ఒకదానివెంట ఒకటి చెప్పమని నీవు కోరబడినట్లయితే, నీవు ఏ రుజువులను వరుసగా చెప్తూతావు? తాను ఏ రుజువుల నిచ్చాడో ముందుగా చూచి, తన పట్టికతో మన పట్టికను పోల్చి చూద్దాం.

చెప్పినదే తిరిగి చెప్పడాన్ని తొలిగించితే, పేతురు పట్టికను వేసి అయిదు ఆధారపు వరుసలను సూచించాడు. మొదటిగా, అతడు క్రీస్తు యొక్క అద్భుతాలను రుజువుగా సూచించాడు. "... దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతములను మహత్కార్యము లను సూచకక్రియలను మీ మధ్యను చేయించి, ఆయనను తనవలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను; ఇది మీరే యెరుగుదురు" (అపొ. 2:22). క్రీస్తు దేవుని యొద్దనుండి వచ్చినవాడని అద్భుతముల యొక్క రుజువే నీకొదేమును ఒప్పించింది. ఆ రాత్రివేళ అతడు ప్రభువును దర్శించినప్పుడు, "బోధకుడా, నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న

సూచక క్రియలను ఎవడును చేయలేడని" నీకొదేము ఆయనతో అన్నాడు (యోహాను 3:2). యేసు నిజమైన అద్భుతాలు చేసినట్టు పూర్తిగా నమ్మదగిన మూలంనుండి వచ్చిన సమాచారము, కాదనలేనట్టు ఆధారపడగలిగిన డాక్యూమెంటు ప్రకటించి నట్లయితే, యివ్వబడిన ఆధారాలనుబట్టి నీకొదేము ఎలా ప్రత్యుత్తరమిచ్చాడో మనం కూడా అలాగే చేయ బలవంతపెట్టబడతాం – ఆయన దేవుని యొద్దనుండి వచ్చినవాడని మనం నమ్మేలా నిర్బంధించబడతాం. దేవుని వాక్యమైయున్న బైబిలు, భూమిమీద బహుగా నమ్మదగిన సమాచార మూలమైయుండి, క్రీస్తు నిజంగా అద్భుతాలు చేసినట్టు సాక్ష్యమిస్తుంది. ఈ రుజువు ఒకే ఒక తీర్మానాన్ని సూచిస్తుంది – దేవునివలన "మెప్పుపొందినవానిగా," ఆయన చేసిన అద్భుతములచేత స్థిరపరచబడి క్రీస్తు దేవుని కుమారుడైయున్నాడు. క్రీస్తు చేసిన అద్భుతములను ఆ జనసమూహమునకు గుర్తుచేసి, దానివలన రుజువు చేయబడే నిర్ణయాన్ని లేక తీర్మానాన్ని అంగీకరించవలసిందిగా అతడు తన శ్రోతలను కోరాడు.

రెండవదిగా, పునరుత్థానపు రుజువును పేతురు తన శ్రోతల యెదుట ఉంచాడు. ఈ పక్షంగా అతడిట్లన్నాడు,

> దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యద్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువవేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించియుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను (అపొ. 2:23, 24).

అపొస్తలుల బోధ అంతటిలో పునరుత్థానము ప్రముఖమైన భాగంగా ఉంది. యూదులు బదులు చెప్పలేక నిలిచిన వాదన అదే. క్రీస్తు యొక్క పునరుత్థానము పిరికివారిని – ధైర్యవంతులుగాను, ధైర్యవంతులను పిరికివారినిగాను తీర్చింది. ఆయనను "సిలువ వేయుమని" పిలాతు ఎదుట ధైర్యముగా కేకలు వేసిన యూదులు (మత్తయి 27:22), ఖాళీ సమాధియనే సత్యం ఎదుట భయపడి వెనుకకు మరలారు. క్రీస్తు తీర్పు తీర్చబడు తుండగా, "ఆ మనుష్యుని నేనెరుగను" అని భయమొంది పలికిన పేతురు, (మత్తయి 27:72) ఖాళీ సమాధికి కొద్ది దూరంలోనే నిలిచి ఆయన పునరుత్థానాన్ని గూర్చి ధైర్యంగా ప్రకటించాడు.

యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అనే తీర్మానంతో కూడిన రుజువును ఆయన పునరుత్థానమిస్తుంది. క్రీస్తు యొక్క దేవత్వాన్ని ఎవడైనా కాదనగోరితే ఆయన పునరుత్థానం లేదని రుజువు చేయగలవాడైయుండాలి. క్రీస్తు పునరుత్థానము క్రైస్తవ్యాన్ని

ఏకైకమైనదిగా చేస్తుంది. ప్రపంచ మతాలన్నిటిలో క్రైస్తవ మత స్థాపకుడు మాత్రమే మృతులలోనుండి లేపబడ్డాడు. ఆయనను గూర్చి తాను చెప్పుకున్న వాటిని అది స్థిరపర్చుతోంది, ఆయన వాగ్దానాలకు అధికార ముద్ర వేస్తుంది, ఆయన మతాన్ని అది చెల్లదగినదిగా చేస్తుంది.

మూడవదిగా, ప్రవచన రుజువులనుండి పేతురు సకారణంగా సమ్మతిపరచాడు. క్రీస్తు యొక్క పునరుత్థానాన్ని గూర్చిన ప్రవచనాన్ని కీర్తనలు 16:8–11నుండి అతడు కోట్ చేశాడు:

> నేనెల్లప్పుడు నా యెదుట ప్రభువును చూచుచుంటిని ఆయన నా కుడిపార్శ్వమున నున్నాడు గనుక నేను కదల్చబడను. కావున నా హృదయము ఉల్లసించెను; నా నాలుక ఆనందించెను. మరియు నా శరీరము కూడ నిరీక్షణ గలిగి నిలకడగా ఉండును. నీవు నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు నీ పరిశుద్ధుని కుళ్లుపట్టనియ్యవు. నాకు జీవమార్గములు తెలిపితివి నీ దర్శన మనుగ్రహించి నన్ను ఉల్లాసముతో నింపెదవు (అపొ. 2:25బి–28).

తన ప్రవచనములో, దావీదు ఉత్తమ పురుషలో పలికాడు. పైకి అతడు తన్ను గూర్చి మాట్లాడుతున్నట్టు కన్పిస్తుంది. దావీదు తన్ను గూర్చి ఈ సంగతులు పలికియుండడు అనడానికి అతడు రెండు వాస్తవాలను సూచిస్తున్నాడు. మొదటిది, అతడు దావీదు మరణాన్ని గూర్చి తెలిపాడు. ఈ ప్రవచనాన్ని వ్రాసిన దావీదు, చనిపోయి సమాధిచేయ బడ్డాడు, అతని సమాధి వారి మధ్యనే నిలిచియుంది. దానికి రుజువుగా అందరు చూడగలిగేలా యెరూషలేములో ఉన్న దావీదు సమాధిని అతడు సూచించాడు (అపొ. 2:29). రెండవది, దావీదునకు దేవుడు చేసిన వాగ్దానాన్ని అతడు వారికి గుర్తుచేశాడు (అపొ. 2:30). కాలక్రమంలో అతని సంతానంలోనుండి వచ్చే ఒకడు అతని సింహాసనం మీద కూర్చుంటాడని దేవుడు అతనికి వాగ్దానం చేశాడు (2 సమూయేలు 7:12). ఆ వాగ్దానం దేవుడు క్రీస్తునందు నెరవేర్చాడు, ఎందుకంటే దేవుడు ఆయనను మృతులలోనుండి లేపాడు, (అపొ. 2:31), ఆత్మ సంబంధమైన సింహాసనముపై తన కుడిపార్శ్వమున ఆయనను కూర్చుండబెట్టాడు. దావీదు సంతతిలోనుండి ప్రభువైన యేసు ఈ లోకానికి అవతరించాడు, మరి యిప్పుడు పరలోకమందు దేవుని కుడిపార్శ్వమున ఆత్మసంబంధమైన సింహాసనముపై ఆసీనుడైయుండి, సంఘము అనే భూమిమీదనున్న తన రాజ్యానికి ఆయన రాజైయున్నాడు.

తన ప్రసంగము యొక్క అంతమందు (అపొ. 2:34, 35) కీర్తన. 110:1లోని

ప్రవచనంనుండి అలాటి వాదమే పేతురు చేసి (కీర్తన. 16:8–11; 110:1), దేవునిచే పంపబడినవాడు మృతులలోనుండి లేపబడి ఆయన కుడిపార్శ్వమునకు హెచ్చింపబడతాడని నిరూపించాడు. యేసు, తన పునరుత్థానములోను మహిమపరచబడడంలోను, ఈ రెండు పాత నిబంధన ప్రవచనాలను స్పష్టంగా నెరవేర్చాడు. గనుక ఆయనే దేవుని అభిషిక్తుడని పేతురు స్థిరపరచాడు.

నాల్గవదిగా, సాక్షుల యొక్క రుజువులను పేతురు ఉపయోగించాడు. "ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము" (అపో. 2:32) అని అతడు తెలిపాడు. పేతురు సూచించిన ప్రవచనం పునరుత్థానాన్ని ప్రవచించినట్టు లేక ముందుగా సూచించినట్టు యూదులు గుర్తించవలసియుంది. క్రీస్తు మృతులలోనుండి లేచియున్నందున ఆ ప్రవచన భాగం నెరవేర్చబడినట్టు పేతురు స్థిరపరచజూచాడు. ప్రభువైన యేసు మృతులలోనుండి లేచియున్నట్టు చూచిన సాక్షుల సాక్ష్యాన్ని ఎదుర్కొనేలా అతడు తన శ్రోతలను నిర్బంధించాడు. వాస్తవంగా సాక్షియనేవాడు బహు నాణ్యమైన రుజువైయుంటాడు. ఇవ్వబడిన సాక్ష్యంలో పరస్పర విరుద్ధ భావాలు లేనంతవరకు సాక్షుల సాక్ష్యాన్ని అధికారంతో కూడిన ఏ కోర్టు అయినా అంగీకరిస్తుంది. తన కుమారుని పునరుత్థానాన్ని దేవుడు తన వాక్యంలో స్థిరపరచడం మాత్రమేగాక, ఆయనను మృతులలోనుండి లేపిన తరువాత ఆయనను చూచిన, ఆయనను తాకిన, ఆయనతో కూడ తినిన, ఆయనతో పఠించిన వారి సాక్ష్యాన్ని కూడా తన గ్రంథమందు దేవుడు భద్రం చేశాడు. ఆలాటి సాక్ష్యాన్ని ఎవడు నిరాకరించగలడు?

అయిదవదిగా, పరిశుద్ధాత్మ దిగి రావడాన్ని పేతురు రుజువుగా సూచించాడు. "కాగా ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించియున్నాడు" (అపో. 2:33) అని అతడు తెలిపాడు. ప్రభువైన యేసు పరలోకానికి వెళ్ళబోతూ, తన తండ్రి వాగ్దానాన్ని వారి మీదికి పంపుతానని ఆయన తన అపొస్తలులకు తెలియజేశాడు (లూకా 24:46–49). ఆత్మ కుమ్మరింపబడ్డ ఫలితాలను జన సమూహం తమ కన్నులార చూచారు. ఆ విధంగా, యేసు తండ్రి కుడిపార్శ్వానికి ఆరోహణమయ్యాడని, ఆత్మను గూర్చిన వాగ్దానం ఆయన తండ్రివలన పొంది, అపొస్తలుల మీదికి ఆయన ఆత్మను పంపాడని అద్భుతరీతిగా వారికి స్థిరపరచబడింది.

ఈ అయిదు మార్గాల్లో యివ్వబడిన రుజువు కాదనలేని తీర్మానాన్ని స్థాపించింది. "కాబట్టి" అనే పదంతో ఈ తీర్మానం మీద వారి దృష్టిని పేతురు కేంద్రీకరింపజేశాడు. "కాబట్టి" లేక "గనుక" అనే పదాన్ని క్రొత్త నిబంధనలో నీవు ఎప్పుడు కనుగొన్నా, ఆగి

అది దేనికొరకు చెప్పబడిందో చూడాలి, ఎందుకంటే అది ఎల్లప్పుడు ఏదో ఒక కారణాన్ని బట్టి చెప్పబడియుంటుంది. "(కాబట్టి,) మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని" పేతురు చెప్పాడు (అపొ. 2:36). యేసే దేవుడు వాగ్దానం చేసిన క్రీస్తని, ఆయన ప్రభువైయున్నాడని – ఆయన అద్భుతములు, మృతులలోనుండి ఆయన పునరుత్థానం, ఆయన ప్రవచనాలను నెరవేర్చడం, ఆయనను గూర్చిన సాక్షుల సాక్ష్యం, పరిశుద్ధాత్మ దిగి రావడం రుజువు చేస్తున్నాయి.

"ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి" అనే అధ్యాయం మనకు ఏ భావాన్ని స్ఫురింపజేస్తుంది? క్రీస్తు క్రైస్తవ్యానికి కేంద్ర బిందువైయున్నాడని అది మనలను ఒప్పించదా? యేసే క్రీస్తై యున్నాడని ఒకడు రుజువు చేసినప్పుడు, క్రైస్తవ్యం నమ్మదగినదైయున్నట్టు అతడు రుజువు చేస్తున్నాడు. మన పాపములకొరకు చనిపోయి, మృతులలోనుండి లేపబడిన క్రీస్తు దేవుని కుమారుడైయున్నట్టు పేతురు నిరూపించకపోయి ఉన్నట్టయితే, తన జన్మ దినముననే క్రైస్తవ్యం మృతిచెందేదే!

## అధ్యాయం మూడు:

## "గాఢమైన అనుభవపు-కేక"

"ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి" అనే దానిలో మూడవ అధ్యాయం "గాఢమైన అనుభవపు–కేక" అని పేరు పెట్టబడింది. ప్రసంగంచేత పేతురు శ్రోతలలో అనేకులు బలంగా కదలింపబడ్డారు. మనస్సాక్షియందు బలంగా కొట్టబడిన వారై, పేతురువైపునకును కడమ అపొస్తలులకును వారి కేక వినిపించారు.

"వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని (పొడువబడి) – 'సహోదరులారా, మేమేమి చేతుమని' పేతురును కడమ అపొస్తలులను అడుగగా" అని లూకా వ్రాశాడు (అపొ. 2:37). King James Versionలో "వారు హృదయములో గ్రుచ్చబడినవారై" అని ఉంది. హృదయములో గ్రుచ్చబడడమనేది – సూది వ్రేలుకు గుచ్చుకున్నట్లో, లేదా ముల్లు ఒకని కాలుకు గుచ్చుకున్నట్టో ఉన్న భావంలాంటిది. ఇదే పద ప్రయోగం వేరే సందర్భంలో, అపొ. 7:54లో యిలా ఉపయోగింపబడింది: "వారీమాటలు విని కోపముతో మండిపడి అతనిని చూచి పండ్లుకొరికిరి." ఈ సందర్భంలో స్తెఫను ప్రసంగానికి యూదులు కోపంతో మండిపడ్డారు. వారి హృదయాలు కోపంచేత మింగివేయబడ్డాయి; వారి హృదయాలు నరకబడినట్టయ్యాయి. అయితే, పేతురు

ప్రసంగానికి యూదులు అత్యధికంగా ఒప్పింపబడిన వారై, దోషంచే ముంచివేయబడ్డారు.

అలా కేకవేసిన జనులు పేతురు యొక్క ప్రసంగానికి ఒకవేళ అంతరాయం కలిగించియుండవచ్చు. ఇలాటి అంతరాయాలు నిజంగా కోరదగనివై యుంటాయి కాని, యిది మాత్రం దీవెనకరమైన అంతరాయమే. "నేను యిప్పుడు బాప్తిస్మము పొందవచ్చా?" అనే ఒక మనిషి ప్రశ్నతో ప్రసంగిస్తున్న సువార్తికుడు ఆటంకపరచ బడ్డాడు. ఆ సువార్తికుడు ఆగి, నేరుగా ఆ మనిషివైపు చూచి, "నా ప్రసంగం ఆగ గలదు. నీవు బాప్తిస్మం పొందగోరితే, మనం ఈ ప్రసంగాన్ని ఆపి, క్రీస్తులోనికి నీకు బాప్తిస్మం యిస్తాం. అప్పుడు తిరిగి యిక్కడికి వచ్చిన తరువాత, ప్రసంగాన్ని ముగిస్తాను" అని అన్నాడు. ఇలాటి అంతరాయం జొరబడడం కాదు ప్రేరేపించడమై యుంటుంది.

వారి ప్రశ్న ఉత్సాహభరితమైనదైయుంది. "మేమేమి చేయాలి?" అని వారు అడుగలేదు. "ఇంకా మేము ఈ లోకంలో చేయగలిగింది ఏముంది? మేము బాధలో ఉన్నాం. మాకు నిరీక్షణ ఏమైనా ఉందా?" అన్నట్టు వారి ప్రశ్న ఉంది. వారి ప్రశ్న బహు తీవ్రంగా అడుగబడింది.

వారి ప్రశ్నవైపు జాగ్రత్తగా చూడు: "సహోదరులారా, మేమేమి చేతుము?" అని వారంటున్నారు. సాటి యూదులను వారు సంబోధిస్తూ, "సహోదరులారా" అనే పదాన్ని వారు ఉపయోగించారు. అది వారి జాతికి సంబంధించిన సందర్భమేగాని, మతానికి సంబంధించింది కాదు. దేవుని యెదుట భయంకరమైన స్థితిలో ఉన్నారని వారు గుర్తించారు. లోకానికి దేవుడు పంపినట్టి రక్షకుని, మెస్సీయాను సిలువ వేయడంలో తాము కూడా భాగస్వాములైనట్టు వారు గుర్తించారు. పెద్ద అక్షరాల్లో పేతురు ప్రసంగము వారి పాపాన్ని వారి యెదుట పెట్టింది (అపొ. 2:23).

నీ జీవితంలో అనేక ప్రముఖమైన ప్రశ్నలను నీకు నీవే వేసికొని వాటికి జవాబు చెప్పవలసియుంటుంది కాని, "రక్షింపబడడానికి నేనేమి చేయాలి?" అనే క్రొత్త నిబంధన ప్రశ్నను నీవు ఎప్పుడైనా అడిగి, దానికి జవాబు పొందావా? పెంతెకొస్తు దినాన హాజరైన అనేకులు, అద్భుతాలు చూచి పేతురు ప్రసంగం వినియు-వారి దోషాన్ని ఎదుర్కో కుండగను, ఆ ప్రశ్నను అడుగుకొన కుండగనే తిరిగి వెళ్లారు. ఒక వ్యక్తి యొక్క జీవితంలో పాపమనేది విపత్కరమైనదే. అది ఎంత విపత్కరమైనదంటే, క్రీస్తు ఈ లోకమునకు అవతరించి, సిలువపై మరణించి దానికి పరిహారం చెల్లించవలసినంతది. దానికంటె యింకను విపత్కరమైన పరిస్థితి ఉంది. దేవుని యెదుట ఒకడు తన దోషాన్ని ఎదుర్కొని, తన దోషానికి దేవుని పరిష్కారాన్ని వెదకకున్నట్టయితే, అన్నిటిని మించిన విపత్తును తాను ఎదుర్కోవలసి యుంటుంది.

## అధ్యాయం నాలుగు:

## "దైవ ప్రేరేపితమైన జవాబు"

"ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి" అనే పుస్తకంలో నాల్గవ అధ్యాయం "దైవ ప్రేరేపితమైన జవాబు" అని పిలువబడింది. పరిశుద్ధాత్మచే నడిపింపబడినవాడై, ఒప్పింపబడిన జనసమూహము యొక్క ప్రశ్నకు పేతురు సూటిగా జవాబు యిచ్చాడు: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ. 2:38).

ఆయన ఆరోహణానికి కొంచెం ముందుగా, గొప్ప ఆజ్ఞ (Great Commission) అని మనం తరచుగా పిలిచే ఆజ్ఞను ప్రభువు యిచ్చారు. ఈ ఆజ్ఞను గూర్చిన మూడు సంపూర్ణ సందేశాలు క్రొత్త నిబంధనలో యివ్వబడ్డాయి: మత్తయి 28:18-20; మార్కు 16:15, 16 విశ్వాసము యొక్క స్థితి నొక్కి చెప్పబడింది. లూకా 24:46, 47 మారుమనస్సు పాపక్షమాపణలనేవి నొక్కి చెప్పబడ్డాయి. మత్తయి 28:18-20 బాప్తిస్మాన్ని ఎత్తి చెప్తుతుంది. ఈ మూడు వాక్య భాగాలు దేవుని కృప ద్వారా రక్షణ లేక పాపక్షమాపణ విశ్వాసము, మారుమనస్సు మరియు బాప్తిస్మములను షరత్తుల మీద అనుగ్రహింపబడుతుందని సూచిస్తున్నాయి. ఈ గొప్ప ఆజ్ఞలోని పదాలు నిస్సందేహంగా ఇలాంటి గ్రహింపునకు సహకరిస్తున్నాయి.

వారి ప్రశ్నకు పేతురు యిచ్చిన జవాబులో గొప్ప ఆజ్ఞ (Great Commission)లో వ్యక్తపరచబడిన మూడు పరిస్థితులు కన్పిస్తాయి. పేతురు యొక్క ప్రసంగంద్వారా వారి హృదయాలలో విశ్వాసము పుట్టించబడింది, మరియు, ఆ విశ్వాసమే తమ కర్తవ్యాన్ని బోధించుమని కేకవేసేలా వారిని ప్రేరేపించింది. గనుక, గొప్ప ఆజ్ఞలోని, ప్రత్యేకించి మారుమనస్సు బాప్తిస్మము అనే తక్కిన రెండు షరత్తులను ఆ యూదుల ప్రశ్నకు పేతురు జవాబుగా ప్రస్తావించాడు. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి ..." (అపొ. 2:38). తన జవాబులో పేతురు పాపక్షమాపణ అనేదాన్ని ఎక్కడ ఉంచాడో గమనించు. బాప్తిస్మానికి ముందు పాపక్షమాపణను లేక రక్షణను అతడు వాగ్దానం చేయలేదు. కాని దానికి తరువాతనే పేతురు పరిశుద్ధాత్మచేత నడిపింపబడ్డాడు, మరియు తానిచ్చిన జవాబు పరిశుద్ధాత్మది, తనది కాదు.

బిగ్గరగా అడిగినవారికి యివ్వబడిన బదులు అపార్థం చేసికొనడానికి వీలులేనంత

స్పష్టంగా ఉంది. ఆ జవాబుయొక్క తాకిడిని దాని ప్రాబల్యాన్ని తప్పించుకొనడానికిగాను, మత సంబంధమైన బోధకులలో కొందరు, అపొ. 2:38లోని "నిమిత్తము" కొరకు అని కాదని, "అందునుబట్టి" అని గ్రీకులో ఉన్నట్లు చెప్ప ప్రయత్నించారు. గ్రీకులోని *eis* అనే పదం "కొరకు" లేక "నిమిత్తము" అని నమ్మదగినట్లు తర్జుమా చేయబడిందని అనేక బైబిలు తర్జుమాలను పోల్చి చూడడంవలన తేలింది. అలా తర్జుమా చేసినవాటి నన్నిటిని ఒక దానిమీద ఒకటి పేర్చితే, – "నిమిత్తము," "కొరకు" లేక దానికి సమానమైన పదముగా తర్జుమా చేయబడింది. ఈ పదాన్ని "అందునుబట్టి" అని ఎవడును తర్జుమా చేయలేదు. బాప్తిస్మము తరువాతనే తప్పక పాపక్షమాపణను పేతురు ఉంచాడు. ఈ ప్రశ్నకు దేవుని జవాబునే నిలువనిద్దాం, ఏదో వివరణతో దానిని నెట్టివేయకుండ చూద్దాం.

క్రొత్త నిబంధనలోని ప్రతి వచనానికి జంట ఉంటుందని ఒక వ్యక్తి అన్నాడు. అది అన్ని వేళ్లల సత్యం కాదు గాని, అందులో కొంత సత్యముంది. కొన్ని క్రొత్త నిబంధన వచనాలకు జంటలున్న మాట వాస్తవమేగాని, వాటిని మనం జాగ్రత్తగా చూచినప్పుడు అదే సత్యం మరోవిధంగా చెప్పబడినట్టు కన్పిస్తుంది. అపొ. 2:38కి జత ఏది? అది అపొ. 22:16. "ప్రభువా నేనేమి చేయవలెను?" అనే ప్రశ్నకు జవాబు వెదకుతూ, సౌలు దమస్కులో ప్రవేశించాడు (అపొ. 22:10ఎ). అతడు విశ్వాసి, అతడు ప్రభువును చూచి, ఆయనతో మాట్లాడి, ఒప్పింపబడినవాడై యున్నాడు. ప్రభువును అతడు అడిగిన ప్రశ్నలోనే తన మారుమనస్సును ప్రదర్శించాడు. తాను అడిగిన ప్రశ్నను బట్టి అతడు ఆయనను ప్రభువుగా గుర్తించినట్టు తేటపడుతుంది; తాను ఏమి చేయాలో చెప్పబడడానికి అతడు దమస్కునకు వెళ్లవలసిందిగా ఆజ్ఞాపించబడ్డాడు. తన ప్రశ్నకు జవాబు పొందక ముందు దమస్కులో అతడు వేచియుండి ప్రార్థనయందును మారుమనస్సునందును మూడు దినాలు గడిపాడు. జవాబుతో అననీయ అతని యొద్దకు పంపబడ్డాడు. అననీయ అతనితో ఏమి చెప్పాడు? అననీయ అతనికి యిచ్చిన జవాబు అపొ. 2:38కి జంటయైయున్నదని నీవు చెప్పవచ్చు. "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసి కొనుమని" అతడన్నాడు. బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తము అనే సందేహమేదైనా ఉంటే, ఆ ప్రశ్నను అపొ. 22:16 శాశ్వతంగా తప్పక ప్రక్కన పెట్టివేస్తుంది.

తన బైబిలు ప్రొఫెసర్ బాప్తిస్మము పాపక్షమాపణకొరకని నమ్మడని, ఆ సిద్ధాంతం తన క్లాసులో బోధిస్తున్నాడని ఒక ప్రయివేట్ మత సంబంధమైన కాలేజీకి వెళ్లే విద్యార్థి అన్నాడు. "దాన్ని గూర్చి నీవు ఏమి చేశావు?" అని అతన్ని ఒక వ్యక్తి అడిగాడట.

“దాన్ని గూర్చి నేను మా తల్లిని అడిగాను, అపొ. 2:38ని వివరించుమని తరగతి అయిన తరువాత ఆయనను అడుగమని ఆమె చెప్పింది. అలా నేను చేశాను. అపొ. 2:38 వద్ద బైబిలును తెరిచి, తరగతి అయిన తరువాత దాన్ని వివరించుమని ఆయనను సగౌరవంగా అడిగాను. అది పాపక్షమాపణ ‘కొరకు’ కాదు, పాపక్షమాపణనుబట్టి అని ఆయన వివరించాడు. ఆయన నాకేమి చెప్పాడో దానిని తిరిగి మా అమ్మకు తెలిపాను. నేను మరల వెళ్లి అపొ. 22:16ను వివరించుమని ఆయనను అడగమని ఆమె చెప్పింది. అలాగే నేను చేశాను. తరగతి అయిన తరువాత ఆయన దగ్గరకు వెళ్లి, నా బైబిలును తెరిచి అపొ. 22:16ను వివరించుమని ఆయనను సగౌరవంగా అడిగాను. ఆ ప్రొఫెసరు ఏమి చెప్పాడో నీకు తెలుసా? ఆయన దానిని వివరించడానికి ప్రయత్నించకుండ, దాన్ని దాటివేసి తరువాత వచనానికి వెళ్లాడని” అతడన్నాడు. అపొ. 22:16ను వివరించడానికి వీలుకాదు, అది అంగీకరించబడాలి లేదా నిరాకరింపబడాలి.

మావన చరిత్రలో చివరి యుగమైయున్న క్రైస్తవ యుగానికి, దేవుడు ఆ ప్రశ్నకు యిచ్చిన జవాబునే పేతురు సూచించాడు. “ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తనయొద్దకు పిలిచిన వారికందరికిని చెందునని వారితో చెప్పెను” (అపొ. 2:39). “మీకును మీ పిల్లలకును,” అనేది సువార్తకు విధేయులయ్యే యూదులను సూచిస్తుంది. “దూరస్థులందరికిని” అనేది సువార్తను విని విధేయులయ్యే అన్యజనులందరిని సూచిస్తుంది. “ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచినవారికందరికిని” అనేది భవిష్యత్తులో సువార్త విని క్రీస్తునొద్దకు వచ్చేవారికందరికిని అని తెలియజేస్తుంది. “దూరస్థులకందరికిని” అనే మాటల్లో అన్యజనులు చేర్చబడక పోయినట్లయితే, “తన యొద్దకు పిలిచిన వారికందరికిని” అనే మాటల్లో తప్పక వారు చేర్చబడియుంటారు. దేవుని సంకల్పాన్ని కేవలం ఆ పెంతెకొస్తు దినానికి మాత్రమే కాకుండ, క్రైస్తవ యుగానికి సంబంధించి భవిష్యత్తులో అన్ని రోజుల కొరకును పేతురు ప్రకటించాడు. “రక్షింపబడడానికి నేనేమి చేయాలి?” అనే ప్రశ్నకు దేవుని జవాబును అతడిచ్చాడు.

## అధ్యాయం అయిదు:

## “ఆశ్చర్యకరమైన ప్రతిక్రియ”

“ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి” – అనే పుస్తకములో అయిదవ అధ్యాయం “ఆశ్చర్యకరమైన ప్రతిక్రియ” అని పేరు పెట్టబడింది. సువార్త సందేశముయొక్క తొలి ప్రకటన ఆశ్చర్యకరంగా అంగీకరింపబడినట్లు లూకా

తెలిపాడు. “కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి” అని అతడన్నాడు (అపో. 2:41).

ఆ ఉదయ కాలాన పేతురును కడమ అపొస్తలులును ఎంతసేపు సువార్త ప్రకటించారో మనకు చెప్పబడలేదు. అయితే, “ఇంకను అనేక విధములైన మాటలతో సాక్ష్యమిచ్చి – మీరు మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణపొందుడని వారిని హెచ్చరించెను” అని లూకా తెలిపాడు (అపో. 2:40). రుజువులతోను వాదనతోను పేతురు వారిని ఒప్పించడం మాత్రమేకాక, సాక్ష్యముతోను హెచ్చరికతోను అతడు వారిని పురికొల్పాడు.

వింటున్న శ్రోతలు పేతురు యొక్క సందేశాన్ని అంగీకరించారు, దాని ప్రకారం జరిగించారు. “కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి” అని లూకా తిరిగి లెక్కించాడు (అపో. 2:41). ఈ జనులు కేవలం వాక్యాన్ని వినువారు మాత్రమే కాదు; దాని ప్రకారం ప్రవర్తించువారును అయ్యున్నారు (యాకోబు 1:25). వారు కేవలం దానిని వినడం మాత్రమే కాదు; దాని ప్రకారం జీవించ వారు తీర్మానించుకున్నారు. ఎక్కువ మంది జనులు చేసే పని కేవలం ప్రసంగాలు వినడమే అయ్యుంటే, అది ఎంత దురదృష్టం. పేతురు ప్రసంగించగా వినిన ఆ గొప్ప జనసమూహంలో కనీసం కొంతమంది తన సందేశంవలన ఒప్పింపబడడం మాత్రమే గాక, తమ మనస్సులు, జీవితాలు ఆ సందేశానికి లోబరచుకొనడంవలన, క్రీస్తులోనికి మార్చబడ్డారు.

వాక్యాన్ని సంతోషంతో అంగీకరించిన మూడు వేలమంది బాప్తిస్మం పొందారు. మార్పు అనేది జరుగకముందు, రక్షణ వాక్యాన్ని సంతోషంతో అంగీకరించాలి. అనేకమంది క్రీస్తులోనికి మార్పు చెందకుండడానికి ప్రధాన కారణం వాక్యాన్ని తమ హృదయాల్లోనికి తీసికొనకుండడమే. దాన్ని సంతోషంతో స్వీకరించినట్లయితే, వాక్యము ఎల్లప్పుడు తన పనిని జరిగిస్తుంది.

## అధ్యాయం ఆరు:

## “వాగ్దానం చేయబడిన శరీరం”

ఈ పుస్తకంలో ఆరవ అధ్యాయం “వాగ్దానం చేయబడిన శరీరం” అని పేరు పెట్టబడింది. క్రీస్తులోనికి బాప్తిస్మం పొందిన ఆ మూడు వేలమంది లూకాచే సంఘముగా

చిత్రించబడ్డారు.

వింతైన లేక ఏకైకమైన దేవుని రాజ్యం రానైయున్నట్టు ప్రవక్తలు ముందుగా ప్రవచించారు (దానియేలు 2:44). బాప్తిస్మమిచ్చు యోహాను, మెస్సీయా కొరకు మార్గమును సిద్ధపరచుతూ ఉండగా, పరలోకరాజ్యము సమీపమైయున్నట్టు ప్రకటించాడు (మత్తయి 3:1, 2). తన పరిచర్య కాలంలో ప్రభువు సహితం, అంటే, దేవుని యొద్దనుండి వచ్చిన మెస్సీయా సహితం, పరలోకరాజ్యము సమీపించినది గనుక మారుమనస్సు పొందుడని జనులను పిలిచాడు (మత్తయి 4:17). ఆయన మృతులలోనుండి లేచిన తరువాత, ఆయన ఆరోహణానికి ముందు నలభైదినాల కాలంలో, ప్రభువు తన అపొస్తలులతోను శిష్యులతోను రాబోతున్న రాజ్యాన్ని గూర్చి మాట్లాడాడు (అపొ. 1:3). తన అపొస్తలులతో పలికిన తన చివరి మాటల్లో, తండ్రి వాగ్దానం చేసిన దానికొరకు కనిపెట్టియుండుడని క్రీస్తు తెలిపాడు (అపొ. 1:4). ఆయన ఆరోహణుడైన పది దినాల తరువాత ఆదివారం ఉదయం దీర్ఘకాలం వేచియున్న సమయం వచ్చింది. పరిశుద్ధాత్మ కుమ్మరింపబడడంతోను (అపొ. 2:1-4), క్రీస్తు మృతులలోనుండి లేచిన తరువాత ప్రకటింపబడిన తొలి సువార్త సందేశంతోను (అపొ. 2:14-36), సువార్తకు విధేయులైన మూడు వేలమందితోను సంఘం జన్మించింది. సువార్తకు విధేయులగుటద్వారా క్రీస్తు రక్తంతో కడుగబడినవారు క్రీస్తు సంఘముగా చేయబడ్డారు. ఆనాటినుండి నేటివరకు, ఒకడు సువార్త విని - విశ్వాసము, మారుమనస్సు, యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనడం, క్రీస్తులోనికి బాప్తిస్మం పొందడం ద్వారా అతడు వారితోకూడ చేర్చబడతాడు (అపొ. 2:47) - అంటే, పెంతెకొస్తు యొక్క ఆ ఆరంభముననే ఉన్న ఆ మూడు వేలమందితో కూడ అతడు చేర్చబడతాడు.

అపొస్తలుల కార్యాల్లో పెంతెకొస్తు దినంనుండి, సంఘము సజీవమైన వాస్తవమై యుండి, వాగ్దానంగా గాని ప్రవచనంగా గాని లేదు. అపొ. 2 చివర్లో లూకా యిలా అన్నాడు; "... మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను" (అపొ. 2:47). అపొస్తలుల కార్యాల్లో దాఖలు చేయబడ్డ పేతురు యొక్క రెండవ ప్రసంగము ముగించే సమయం విషయంలో, లూకా యిలా వ్రాశాడు, "వాక్యము వినినవారిలో అనేకులు నమ్మిరి వారిలో పురుషుల సంఖ్య యించుమించు అయిదు వేలు ఆయెను" (అపొ. 4:4). అననీయ సప్పీరాల మరణం తరువాత (అపొ. 5:1-10), లూకా యిలా దాఖలు చేశాడు, "సంఘమంతటికిని, ఈ సంగతులు వినినవారికందరికిని మిగుల భయము కలిగెను" (అపొ. 5:11). స్తెఫనును రాళ్లతో కొట్టి చంపిన తరువాత (6:8-7:60), లూకా యిలా అన్నాడు - "... ఆ కాలమందు

యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున, అపొస్తలులు తప్ప అందరు యూదయ సమరయ దేశములయందు చెదరిపోయిరి" (అపొ. 8:1). లూకా ప్రకారం, అప్పుడు, దేవుని విశేష రాజ్యమైన సంఘము వచ్చింది.

గొప్ప సువార్త ప్రసంగీకుడైన మార్షల్ కీబుల్ వద్దకు ఒకడు వచ్చి "సహోదరా కీబుల్, నే నిక్కడ ఫీల్ చేయనిష్టపడుతున్నా, నే నిక్కడే దాన్ని ఫీల్ చేయనిష్టపడు తున్నానని" అన్నట్టు చెప్పబడింది. అలాటి పరిస్థితుల్లో పెట్టినప్పుడు మరువ లేకుండ జవాబు చెప్పే అద్భుతమైన సామర్థ్యం సహోదరుడు కీబుల్‌కు ఉంది. తన బైబిలువైపు చూపుతూ, "మంచిది, నేను దాన్ని చదువకోరతాను. నేను యిక్కడే దాన్ని చదువకోరు తున్నాను" అని అతడు ఆ వ్యక్తికి బదులిచ్చాడట. ఫీలింగ్స్ ప్రముఖమైనవే, అవి మనలను నడిపించేవిగా చేయకూడదు. కేవలం దేవుని వాక్యమైయున్న బైబిలు మాత్రమే మనలను నడిపించాలి. యథార్థ హృదయంతో దేవుని వాక్యాన్ని అంగీకరించి విధేయత చూపిన దానిమీద మన ఫీలింగ్స్ ఆధారపడినప్పుడు, క్రొత్త నిబంధనలో చెప్పబడిన నిజమైన లేక నిష్కళంకమైన ఆనందం మనం కలిగియుంటాం.

## ముగింపు

"ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి" అనే పుస్తకాన్ని మనం ముగించుతూ, మనం చదివిన దానిని గూర్చి మనం ఆలోచన చేయనారంభిస్తాం. మన దిన పత్రికలలోగాని, స్థానికమైన లేక జాతీయమైన టెలివిజన్ న్యూస్‌లోగాని ప్రచురింపబడే ఏ విశేషాలన్నింటికంటె ప్రత్యేకమైనదని తెలిసివస్తుంది. గతాన్ని దాచియుంచిన తెరను అక్షరార్థంగా లాగివేయగలిగాం, మరియు ప్రభువైన యేసు యొక్క జీవితం, మరణం, పునరుత్థానం, తరువాత లోకపు చరిత్రలో చారిత్రాత్మక మైనదియు భూదిగంతములవరకు వ్యాపించునదియునైన సంఘటన అపొస్తలుల కార్య గ్రంథం ద్వారా మనం చూస్తున్నాం. నిజంగా సంఘ ఆరంభాన్ని మనం చూచాం. దీర్ఘకాలం వేచియుండగా వచ్చిన దేవుని రాజ్యమది. దాని ఆరంభంతో, క్రైస్తవ యుగము లేక "అంత్య దినముల" యుగము అంటే మానవ చరిత్రలో కడపటి యుగారంభం జరిగింది.

మనం యిప్పుడు చదివిన పుస్తకం తరువాత ప్రముఖమైన మరో పుస్తకం వస్తుంది. ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథయొక్క మూడవ భాగమని మనం దాన్ని పిలువవచ్చు. క్రీస్తులోనికి నీవు మార్పు చెందిన కథయిది. ప్రభువైన యేసు నిర్మించిన

సంఘంలో నీవు భాగమైయున్న కథ. ఆ కథ మనలో ప్రతి ఒక్కనికి భిన్నమైనదై యుండవచ్చు. మనలో అనేకులకు ఆ కథ తేలికగా వ్రాయబడవచ్చు, కాని మనలో యింకా యితరులకు అంత తేలికగా వ్రాయబడకపోవచ్చు ఎందుకంటే అది సంభవించలేదు గనుక. నీతో అది ఎలా ఉంది? ఆ కథ జరిగిందా? నీవు క్రొత్త నిబంధన క్రైస్తవుడవైనావా?

నీవు క్రొత్త నిబంధన క్రైస్తవుడవు కానట్లయితే, నీవెలా క్రైస్తవుడవు కావాలో నీకు తెలుసు, నీవు సంతోషముతో సువార్త వాక్యమును అంగీకరించి, నీవు దానికి హృదయపూర్వకంగా లోబడుటవలన, అపొ. 2లో మనం చూచిన అదే పరలోక రాజ్యములోనికి–దేవుని రాజ్యములోనికి నీవు ప్రవేశింపగలవు.

## పరిశీలనకైన ప్రశ్నలు

*(జవాబులు – 253వ పేజీలో)*

1. ఎన్నడూ చెప్పబడనంత మహా గొప్ప కథకు తదుపరి సంఘ స్థాపనము జరిగినట్టు ఏ భావంతో మనము చెప్పగలము?
2. పెంతెకొస్తు దినాన అపొస్తలులు మాత్రమే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందియున్నట్టు నీవు ఏ ఆధారములను లేక రుజువులను యివ్వగలవు?
3. అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందడంలో దైవికమైన కారణాలను చర్చించుము.
4. అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందడమనేది ఎట్టి భావాన్ని స్ఫురింప జేస్తుంది?
5. క్రీస్తు యొక్క దేవత్వాన్ని గూర్చి పేతురు తన ప్రసంగంలో తెలిపిన రుజువులను చర్చించుము.
6. దేవుని విమోచనా సంకల్పానికి క్రీస్తు యొక్క పునరుత్థానం ఎలా ఆయువు పట్టయి ఉంటుంది? ఆయన మృతులలోనుండి పునరుత్థానం పొందనట్లయితే, క్రీస్తు దేవుని కుమారుడని మరి యితర ఏ భావంతోనైనా మనం చెప్పగలిగి యుండేవారమా?
7. పాపంలో జీవించే దానికంటే ఘోరమైన విపత్తును నీవు ఆలోచింపగలవా?
8. రక్షణకు సంబంధించిన షరత్తుల విషయంలో (Great Commission) గొప్ప ఆజ్ఞ యొక్క మూడు రకాలైన ఒత్తి పలకడాలను వివరించుము (మత్తయి 28:18–20; మార్కు 16:15; లూకా 24:46, 47).

9. అపొ. 22:16, అపొ. 2:38ని ఎలా ప్రోత్సహిస్తుందో చర్చించుము.

## పద సహాయకారి

**మార్పు చెందుట –** ఒకడు తన హృదయాన్ని మార్చుకొని క్రైస్తవుడగుట.

**అద్భుత సంబంధమైన యుగం –** అపొస్తలులును, అపొస్తలులు ఎవరిమీద చేతులుంచిరో వారును అద్భుతములు చేయగలిగిన కాలము. అది సంఘ బాల్యదశ కాలము. దేవుడు ప్రార్థనలకు యింకా జవాబు యిచ్చేవాడైయున్నా, కడపటి అపొస్తలుని మరణంతో అద్భుత సంబంధమైన యుగం అంతరించింది (ఎఫెసీ. 4:11–13; 1 కొరింథీ. 13:8–10).

**నీకొదేము –** రాత్రివేళ యేసు వద్దకు వచ్చిన యూదుల అధికారి, బోధకుడు దేవుని రాజ్యంలో ఎలా ప్రవేశించాలో ప్రభువు అతనికి బోధించాడు (యోహాను 3).

**ప్రత్యక్షత –** బయలుపరచబడిన సత్యము లేదా దేవుని పరిశుద్ధాత్మవలన మానవునికి యివ్వబడిన ప్రత్యక్షత – బైబిలు.